
రూర్బన్ పంచాయతీగా ప్రతిపాదించిన వి.కోట

పంచాయతీల అప్‌గ్రేడ్

● పల్లెల్లో సరికొత్త పాలనకు శ్రీకారం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ వ్యవస్థ ప్రక్షాళన దిశగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఆదాయం, జనాభా ప్రాతిపదికన పంచాయతీలను బలోపేతం చేయడానికి సచివాలయ వ్యవస్థను హేతుబద్ధీకరిస్తున్నారు.నాలుగు గ్రేడ్లుగా పంచాయతీలను విభజించారు. పంచాయతీ కార్యద ర్శులు ఇకపై పంచాయతీ అభివృద్ధి అధికారులు(పీడీవో)గా వ్యవహరించనున్నారు. ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ప్రతిపాదనలు పంపాం

పంచాయతీల్లో జనాభా, ఆదాయం ప్రకారం గ్రేడ్ల వారీగా విభజించడానికి అవసరమైన వివరాలతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చే మార్గదర్శకాల ప్రకారం పంచాయతీల విభజనకు చర్యలు తీసుకుంటాం.

- డీపీవో సుధాకర రావు

సిబ్బంది నియామకం ఇలా

రూర్బన్ పంచాయతీలుగా గుర్తించిన స్పెషల్ గ్రేడ్ పంచాయతీలను చిన్న పురపాలక సంఘంగా రూపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.ఇందులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్,జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు బిల్‌కలెక్టర్లు, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్, మేస్త్రీ, ఇద్దరు సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్, డ్రెయిన్ క్లీనర్, ఎలక్ట్రీషియన్, సహాయ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ట్యాంకు క్లీనర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వివిధ శాఖల సిబ్బంది ఉంటారు. గ్రేడ్-1 పంచాయతీల్లో 20మంది, గ్రేడ్-2లో 12మంది, గ్రేడ్-3లో 9 మందిని నియమిస్తారు. ప్రస్తుతం గ్రేడ్-4, గ్రేడ్-5 పంచాయతీలను రద్దు చేస్తూ అక్కడి వారికి గ్రేడ్-3, గ్రేడ్-2 కార్యదర్శులుగా పదోన్నతి కల్పిస్తారు.

విభజన ఇలా..

పదివేల జనాభా, ఏడాదికి రూ. కోటి , ఆపై ఆదాయం ఉన్న గ్రామ పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా పరిగణిస్తారు. వీటికి పంచాయతీ కార్యదర్శి స్థానంలో డిప్యూటీ ఎంపీడీవోలను నియమించనున్నారు. నాలుగువేల నుంచి పదివేల మంది జనాభా, ఏడాదికి రూ. 50 లక్షలు, ఆపై ఆదాయం, మండల కేంద్రంగా ఉన్న పంచాయతీలను గ్రేడ్-1గా ఎంపిక చేస్తారు. కార్యదర్శులు పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తారు. 2వేల నుంచి నాలుగువేల మంది జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్-2గా, రెండు వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలను గ్రేడ్-3గా ఎంపిక చేస్తారు.

నాలుగు రూర్బన్ పంచాయతీల గుర్తింపు

కాణిపాకం, గంగవరం, కార్వేటినగరం, వి.కోట పంచాయతీల్లో పట్టణ తరహా సేవలను అందించేందుకు మంత్రి వర్గ సమావేశంలో ఆమోదముద్ర వేశారు. క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసి పంచాయతీలను స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన స్థానిక సంస్థలుగా మార్చనున్నారు. పురపాలక సంఘం మాదిరిగానే ఈ నాలుగు రూర్బన్ పంచాయతీల్లో పరిపాలన విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రణాళిక, ప్రజారోగ్యం, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, ఇంజనీరింగ్ విభాగాలు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించనున్నారు. ఇల్లు, భవన నిర్మాణాలకు అనుమతులు, అక్రమ నిర్మాణాల నియంత్రణకు పురపాలక సంఘం మాదిరిగానే కంట్రీప్లానింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. సచివాలయాల్లో అధికంగా ఉన్న ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లను ఈ రూర్బన్ పంచాయతీల్లో గ్రామీణ ప్లానింగ్ అసిస్టెంట్లుగా నియమిస్తారు.

గ్రేడ్	పంచాయతీలు
రూర్బన్(స్పెషల్)	4
ప్రథమ	61
ద్వితీయ	214
తృతీయ	417
	696


మృతి చెందిన కిట్టప్ప

పంటకోసమెళ్లి ప్రాణం కోల్పోయాడు!

మరో రైతును బలిగొన్న గజరాజులు

కుప్పం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఏనుగులు మరో రైతును పొట్టనబెట్టుకున్నాయి. జిల్లాలో రోజూ ఎక్కడో ఒకచోట పంటలపై దాడి చేసి తొక్కి నాశనం చేస్తున్న ఏనుగులు అటవీ సమీప ప్రాంతాల రైతుల కంటికి కునుకు లేకుండా చేస్తున్నాయి. అప్పుడప్పుడూ రైతులనూ తొక్కి చంపేస్తున్నాయి.ఈసారి కుప్పం మండలం ఉర్లఓబనపల్లె పంచాయతీ కూర్మానపల్లెకు చెందిన రైతు కిట్టప్ప(64) ఒంటరి ఏనుగు దాడితో ప్రాణాలు కోల్పోయాడు.రాగి, జొన్న పంటలను సాగు చేసిన కిట్టప్ప అడవి పందుల బెడద ఎక్కువగా ఉండటంతో వాటినుంచి పంటలను కాపాడుకునేందుకు పొలం వద్దే వున్న చిన్నపాటి గుడిసెలో రాత్రిపూట పడుకుంటున్నాడు.సమీప అటవీ ప్రాంతంలో కొన్ని రోజులుగా ఆరు ఏనుగులు సంచరిస్తూ పంటలకు నష్టం కల్గిస్తున్నాయి. వాటినుంచి విడిపోయిన ఒక ఏనుగు గురువారం తెల్లవారుజామున కిట్టప్ప పొలం వైపు వచ్చింది. ఏదో జంతువు వస్తున్నట్లు అలికిడి కావడంతో కిట్టప్పకు మెలకువ వచ్చింది.అది ఏనుగని తెలియక బెదిరించే క్రమంలో అదిలించడంతో ఏనుగు గుడిసెను తోసి తొక్కి వెళ్ళిపోయింది.లోపలున్న కిట్టప్ప ప్రాణాలు కోల్పోయిన విషయం ఉదయం గమనించిన కుటుంబీకులు కన్నీళ్ళపర్యంతమయ్యారు.ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు అక్కడకు చేరుకుని కిట్టప్ప మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు డీఎఫ్‌వో శ్రీనివాసులు కూర్మానపల్లెకు చేరుకుని కిట్టప్ప భార్య, పిల్లలను పరామర్శించారు. తక్షణ సాయంగా ప్రభుత్వం తరపున రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. మరో రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కొంతకాలంగా ఏనుగులు అటవీ సరిహద్దు ప్రాంతాల్లో పొలాలపై వరుస దాడులకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కిట్టప్ప కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ భరోసా ఇచ్చారు.అలాగే ఏనుగుల దాడుల నిరోధానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, రేంజర్ జయశంకర్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి:డీఎఫ్‌వో

కుప్పం అటవీ సరిహద్దు గ్రామాల్లో ఉండే ప్రజలు ఏనుగుల దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చిత్తూరు డీఎఫ్‌వో శ్రీనివాసులు హెచ్చరించారు.అటవీశాఖ అధికారులు సూచించే విధంగా నడచుకోవాలన్నారు. పంటలను కాపాడుకునే క్రమంలో ఎవరూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు.



ఘటనా స్థలం వద్ద గుమికూడిన గ్రామస్తులు - కిట్టప్ప భార్యకు రూ.5లక్షల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

మరిన్ని బ్యాంకులు వస్తున్నాయ్

● ప్రతి ఐదు కిలోమీటర్ల పరిధిలో బ్యాంకింగ్ సేవలు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బ్యాకింగ్ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువకానుంది. బ్యాంకు సేవలను విస్తృతం చేయాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల బ్యాంకర్ల సమితిలను(ఎస్ఎల్‌బీసీ) ఆదేశించింది. ప్రతి ఐదు కిలోమీటర్ల పరిధిలో ఒక శాఖ లేదా బ్యాంకింగ్ సేవా కేంద్రం, ఏటీఎం తప్పనిసరిగా ఉండాలని మార్గదర్శకాలు జారీచేసింది. ఈ క్రమంలో జిల్లాలో బ్యాంకు సేవలు అవసరమైన గ్రామాల్ని గుర్తించి.. ఏర్పాటు చేసేందుకు జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రారంభంలో పుంగనూరులో వనమాలదిన్నెలో పంజాబ్ నేషనల్ బ్యాంకు, బట్టందొడ్డిలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు, పలమనేరులోని కొలమాసనపల్లెలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు శాఖలను తెరవబోతుంది. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 31 మండలాల పరిధిలో 275 బ్యాంకు బ్రాంచీలు, 415 మంది బిజినెస్ కరస్పాండెంట్లు, 293 ఏటీఎంలు కొనసాగుతున్నాయి. వీటితోపాటు కేంద్రం ఆదేశాల మేరకు బిజినెస్ కరస్పాండెంట్ల సేవా కేంద్రాలు, ఏటీఎం కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన ప్రాంతాల్ని గుర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఎల్డీఎం హరీష్ మాట్లాడుతూ.. జిల్లాలో బ్యాంకింగ్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ఎస్ఎల్‌బీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నూతన బ్రాంచిలతోపాటు గ్రామాలు, పట్టణాల్లో సేవా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

రేపు వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రతపై కార్యక్రమాలు

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో భాగంగా మూడో శనివారం జిల్లావ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఈనెల 15వ తేదీన మూడో శనివారం సందర్భంగా వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత అంశంపై కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు.

పక్కా ఇళ్ల కోసం కసరత్తు

● రేషన్ కార్డు, సొంత స్థలం ఉండడమే అర్హత
● అర్హుల కోసం ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సర్వే
● సచివాలయాల్లో దరఖాస్తుకు అవకాశం
● నెలాఖరు వరకు గడువు పొడిగింపు
● 40వేల దరఖాస్తులు వస్తాయని అంచనా


వి.కోట మండలంలోని పాపేపల్లిలో మొండి గోడలతో దర్శనమిస్తున్న జగనన్న లేఅవుట్-3

చిత్తూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేదలు పక్కా ఇండ్లను నిర్మించుకునేందుకు కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున ఆర్థిక సహకారం అందించనుంది.అర్హుల ఎంపిక ప్రక్రియను మొదలు పెట్టింది. జాబితా సిద్ధమయ్యాక కేంద్ర ప్రభుత్వ వాటాకు, రాష్ట్ర వాటా కూడా జత కానుంది. రాష్ట్ర వాటా నయాపైసా ఇవ్వని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణానికి పేదలు తీవ్ర ఇబ్బంది పడిన విషయం తెలిసిందే.కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 40,335 మంది ఇంటి నిర్మాణానికి హౌసింగ్ శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు.వీరిలో 1457మందికి సొంత స్థలం లేదు. మిగిలినవారి వివరాలను క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సర్వే చేస్తున్నారు. లబ్ధిదారుడి ఫొటోతో పాటు ఆ స్థలాన్ని జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ప్రస్తుతం సొంత స్థలమున్నవారికి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించారు.

ఈసారి పెరగనున్న యూనిట్ కాస్ట్

కేంద్ర ప్రభుత్వం తన వాటాను ఇదివరకే ప్రకటించింది. పట్టణాల్లో రూ.1.50 లక్షలు, గ్రామాల్లో రూ.1.59 లక్షలుగా యూనిట్ కాస్ట్‌ను నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షల బేసిక్ యూనిట్ కాస్ట్‌కు అదనంగా ఉపాధిహామీ కింద రూ.27 వేలు, స్వచ్ఛ భారత్ కింద రూ.12 వేలను ఇస్తున్నారు. ఇలా మొత్తంగా రూ.1.59 లక్షలు అందనున్నాయి. ఇదంతా కేంద్ర వాటానే. దీనికి రాష్ట్ర ప్రభుత్వం కూడా తన వాటా ఇవ్వనుంది. అయితే ఎంత అనేది ఇంకా స్పష్టత రాలేదు. కనీసం రూ.లక్షకు పైగా ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అంటే, రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ప్రభుత్వాల సాయం ఉంటుంది.

వైసీపీ హయాంలో ఇబ్బందులు

వైసీపీ హయాంలో కేంద్రం 73 వేల ఇళ్లను మంజూరు చేసి.. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షల యూనిట్ కాస్ట్‌తో పాటు రూ.30 వేల ఉపాధిహామీ నిధుల్ని అందించింది. దీనికి అప్పటి వైసీపీ ప్రభుత్వం అదనపు వాటా ఇవ్వలేదు. దీంతో నిర్మాణానికి ఆ డబ్బులు సరిపోక, కొండల్లో గుట్టల్లో ఇచ్చిన పట్టా నివాసయోగ్యంగా లేక.. చాలా మంది పేదలు ఇళ్లను నిర్మించుకోలేదు. తన వాటా నయాపైసా ఇవ్వని వైసీపీ ప్రభుత్వం ఆయా కాలనీలకు జగనన్న కాలనీలంటూ పేరు పెట్టుకుంది.

రూ.2.50 లక్షలతో కొత్తగా 2472 గృహాలు

రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం బుధవారం పండుగలా గృహప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా జిల్లాలో 10,168 మందికి ఇంటి తాళాలు అందించిన విషయం తెలిసిందే. పీఎంఏవైజీలో భాగంగా ఓ వైపు జిల్లాకు 40 వేల గృహాల మంజూరుకు సర్వే జరుగుతుండగా.. మరోవైపు 2472 గృహాలను కొత్తగా మంజూరు చేశారు. 5 మున్సిపాలిటీలతో పాటు పలమనేరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు ఈ కొత్త గృహాల్ని కేటాయించారు. వీటికి కేంద్రం ఇచ్చే రూ.1.50 లక్షలతో పాటు రాష్ట్రం కూడా రూ.లక్ష వేసి మొత్తంగా రూ.2.50 లక్షల్ని అందించనుంది. పీఎంఏవైజీలో మంజూరయ్యే గృహాలకు రాష్ట్ర వాటా ఖరారవ్వని విషయం తెలిసిందే.

అప్పట్లోనే రాష్ట్ర వాటా వేసిన టీడీపీ

2014-19 మధ్య కూడా కేంద్రం రూ.1.50 లక్షలు సాయమే అందించింది. అయినా అప్పటి టీడీపీ ప్రభుత్వం అదనంగా తన వాటా రూ.లక్ష వేసి.. యూనిట్ కాస్ట్‌ను రూ.2.50 లక్షలుగా చేసింది. దీంతో అప్పట్లో ఇళ్ల నిర్మాణాలు జోరుగా జరిగాయి. ఈసారి కూడా రాష్ట్ర వాటా వేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ఇదివరకే ప్రకటించారు. ఎంత అనేది ఇంకా నిర్ణయించలేదు.

జియో ట్యాగ్‌తో అర్హుల లెక్క పక్కా : కేంద్ర ప్రభుత్వం పీఎంఏవైజీ (ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్) పథకంలో భాగంగా అర్హుల వివరాలను అప్లోడ్ చేయమని ఓ యాప్‌ను రూపొందించింది. అందులో అర్హుల వివరాలు మా త్రమే కాకుండా ఇంటి స్థలమున్న ప్రాంతా న్ని జియో ట్యాగింగ్ కూడా చేయాల్సి ఉంది. ఈ గడువు ఈ నెల 5వ తేదీతో ముగియగా, యాప్ సరిగా పనిచేయని కారణంగా వివరాలను సరిగా నమోదు చేయలేదు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఈ నెలాఖరు దాకా గడువు పొడిగించింది. నెలాఖరులోగా అర్హుల వివరాలను యాప్‌లో అప్లోడ్ చేస్తామని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు.

జిల్లా జైలు తనిఖీ


అంజనీ కుమార్‌కు స్వాగతం పలుకుతున్న వెంకట్ రెడ్డి

చిత్తూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జైళ్ల శాఖ డీజీపీ అంజనీకుమార్ గురువారం జిల్లా జైలును తనిఖీ చేశారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. జైలు నుంచి విడుదలయ్యాక సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఉండాలని చెప్పారు. అనంతరం ఖైదీల గదులను, వంటగదిని, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు డీజీపీకి జైలు సూపరింటెండెంట్ కె.వెంకట్ రెడ్డి మొక్కను అందించి స్వాగతం పలికారు.

27మందితో జిల్లా అధికారుల సంఘం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అధ్యక్షతన 27 మందితో కూడిన జిల్లా ఆఫీసర్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. కార్యదర్శిగా ఏపీడీ వెంకటరమణ, కోశాధికారిగా డీసీవో లక్ష్మి, గౌరవ అధ్యక్షుడిగా ఏవో మురళీకృష్ణ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీపీవో శ్రీనివాసరావు,ఉపాధ్యక్షులుగా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డ్వామా పీడీ రవికుమార్, డీఎస్వో శంకరన్,డీటీవో రామచంద్రయ్య,డీపీవో సుధాకర్‌రావు,జాయింట్ సెక్రటరీలుగా డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, జిల్లా సైనిక సంక్షేమాధికారి రాఘవులు, ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సంధ్యారాణి, 11 మందిని ఈసీ సభ్యులుగా ఎన్నుకున్నారు.



అంతా మీ చేతిలోనే ఉంది

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం ● జాగ్రత్తలే శ్రీరామరక్ష

మధుమేహం అంటే..

మన రక్తంలో గ్లూకోజ్(చక్కెర) స్థాయి ఎక్కువగా ఉండే స్థితిని మధుమేహం (డయాబెటిక్) అంటారు. ఇన్సులిన్ అనే హార్మోన్ తగినంతగా శరీరంలో ఉత్పత్తి కాకపోవడం, కణాలు దానికి సరిగ్గా స్పందించక పోవడం వలన గ్లూకోజ్ స్థాయి పెరిగి మధుమేహంగా మారుతుంది.

తిరుపతి(వైద్యం), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మధుమేహం(డయాబెటిక్) జీవితకాల సమస్యే కానీ, తగిన జాగ్రత్తలో నియంత్రించుకుంటే ఆరోగ్యానికి ముప్పు ఉండదు. తీసుకునే ఆహారం, శారీరక వ్యాయామం ఇవి రెండూ నియంత్రణలో కీలకం. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పుల ఫలితంగా ప్రజల్లో మధుమేహం పెరుగుతోంది. మధుమేహం వ్యాప్తిస్తున్న దేశాల్లో మన దేశం మొదటి స్థానంలో ఉంటే, దేశంలో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉంది. రాష్ట్రంలో మన జిల్లా నాలుగో స్థానంలో ఉంది. తిరుపతి జిల్లాలో 1,22,245 మంది మధుమేహంతో బాధపడుతున్నారని లెక్కలు చెబుతున్నాయి. ఇది టెస్ట్ చేసుకుని మధుమేహం నిర్ధారణ అయినవారి సంఖ్య. టెస్ట్ చేయించుకోనివారిలో ఈ వ్యాధి ఎంతమందికి ఉందో అంచనా కట్టలేం.

లక్షణాలు:

ఎక్కువగా మూత్ర విసర్జన, అధికంగా దాహం, ఆకలి వేయడంతో పాటు బరువు తగ్గడం, దృష్టిలోపం, అలసట, గాయాలు మానకపోవడం, చర్మం దురదగా అనిపించడం.

రెండు రకాలు :

ఒకటి గర్భంతో ఉన్న వారికి, పురిటి పిల్లలకు వస్తుంది. వీరు వైద్యుల సలహాలు పాటించి ఆహారం విషయంలో సరైన జాగ్రత్తలు పాటించడం వలన కాన్పు తరువాత, బిడ్డ పుట్టిన నెల తరువాత వీరు సాధారణ పరిస్థితికి వస్తారు.

రెండో దశలో వచ్చే మధుమేహం జీవితకాలం మనతోనే ఉంటుంది. దీనిని కేవలం మందులు, సరైన ఆహారం, వ్యాయాలతో అదుపులో ఉంచుకోవచ్చు.

జాగ్రత్తలు పాటించకపోతే..

మధుమేహంతో బాధపడే వారు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే, వైద్యుల సూచనలు పాటించకపోతే నియంత్రణ సాధ్యంకాదు. దీని ప్రభావం శరీరంలోని పలు అవయవాలపై పడి వాటిని దెబ్బతీయడంతోపాటు చివరకు ప్రాణాలే బలిఅవుతాయి. ప్రధానంగా గుండెపోటు, పక్షవాతం, నరాలు దెబ్బతినడం(డయాబెటిక్ న్యూరోపతి), కిడ్నీ సమస్యలు, దృష్టిలోపం(డయాబెటిక్ రెటినోపతి) వంటి ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. పాదాల, చర్మ, దంతాల, జీర్ణ, లైంగిక, మానసిక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

పూర్తిగా నయం చేస్తామనేవారి మాటలు నమ్మొద్దు



ప్రస్తుత జీవన విధానంలో వయస్సుతో సంబంధం లేకుండా మధుమేహం బారిన పడుతున్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి మధుమేహ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం సురక్షితం. అలాగే మధుమేహ బాధితులు 3-4 నెలలకు ఒకసారి అవసరమైతే రెండు వారాలకు ఒకసారి ఈ పరీక్షలు చేసుకుంటూ తగు జాగ్రత్తలు పాటించాలి. మధుమేహాన్ని పూర్తిగా తగ్గిస్తామనే వారి మాటలు నమ్మి నాటు మందులు, ఇతర కషాయాలు వాడి ప్రాణాల మీదకు తెచ్చుకోకండి.

- డాక్టర్ అలోక్ సచిన్, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, స్విమ్స్

సొంత నిర్ణయాలు వద్దు



మధుమేహంతో తీవ్రంగా ఇబ్బంది పడే వారు అన్ని విభాగాల డాక్టర్లు అందుబాటులో ఉండే ఆస్పత్రుల్లో మాత్రమే చూపించుకోవడం సురక్షితం. మధుమేహ బాధితులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ ఖరీదైన మందులు, ఇన్సులీన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిని కూడా డాక్టర్లు చెప్పిన విధంగానే వాడాలి. ప్రధానంగా మధుమేహ బాధితులు ఆహారం, వైద్యం వంటి విషయాల్లో సొంత నిర్ణయాలు తీసుకోకూడదు.

- డాక్టర్ తులసీరాం, ప్రొఫెసర్ ఆఫ్ జనరల్ మెడిసిన్, రుయాస్పత్రి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

● క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. నడక వల్ల ప్రయోజనం ఉంటుంది.
● ఒత్తిడిని తగ్గించుకోవాలి. ● చక్కెరతో చేసిన పదార్థాలు, స్వీట్లు, సిరప్‌లు వంటి వాటి జోలికి పోరాదు.
● ఫైబర్ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలి.
● క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.

శ్రీవారి సేవలో ప్రముఖులు


వేములపాటి అజయ్ - వెంకటేష్

తిరుమల, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్, అల్లు అర్జున్ సోదరుడు అల్లు వెంకటేష్ దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

శ్రీహరి సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.54 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,283
తలనీలాలు సమర్పించినవారు: 22,583

‘పద్మావతి’లో ‘నృత్య వాహిని’





తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ‘నృత్య వాహిని’ మొదలైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని గురువారం వీసీ ఉమ ప్రారంభించారు. కళల ద్వారా మనుషుల్లో సమైక్యతా భావన పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. దేశ, విదేశీ ప్రతినిధులతో నృత్యోత్సవం నిర్వహించడం ద్వారా యూనివర్సిటీ విద్యార్థినుల్లో ఉత్తేజం కలుగుతుందన్నారు. మనకు వారసత్వంగా సంక్రమించిన నృత్యాలను పరిరక్షించుకోవాలని, దీనికి యూనివర్సిటీలో సంగీత, నృత్య విభాగం ఎంతో కృషి చేస్తుందన్నారు. నృత్యాలను కాపాడుకోవడం అంటే మన సంస్కృతిని కాపాడుకోవడం అవుతుందని మైసూరు వర్సిటీ ప్రొఫెసర్ శ్రీధర్ అన్నారు. ఆయా ప్రాంతాల ప్రతినిధులు వివిధ నృత్య రీతులతో అలరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రజని, హ్యూమనిటీస్ డీన్ వాణి, అంతర్జాతీయ డీన్ విజయలక్ష్మి, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ కార్యదర్శి హిమబిందు, దేశ, విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు.


నృత్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ ఉమ

ఇథనాల్ ప్లాంట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ


మాట్లాడుతున్న జడ్పీటీసీ కట్టా జ్యోతి, వేదికపై ఆర్డీవో కిరణ్మయి, కాలుష్యనియంత్రణ శాఖ ఈఈ ఆదిశేఖర్

నాయుడుపేట టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట-మేనకూరు సెజ్‌లోని కోనేటిరాజుపాళెంలో గురువారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఆర్డీవో కిరణ్మయి అధ్యక్షత వహించారు. అటవీశాఖ సమక్షంలో నయరా ఎనర్జీ లిమిటెడ్ పరిశ్రమకు సంబంధించి ప్రజల అభిప్రాయాన్ని సేకరించారు. 400 కెఎల్‌పీడీ నూరుశాతం సామర్థ్యంతో ఇథనాల్ తయారీతోపాటు 10.3 మెగావాట్ల జనరేషన్ పవర్‌ప్లాంట్ పరిశ్రమ ఏర్పాటవుతుందని ఆర్డీవో తెలిపారు. పరిశ్రమకు సంబంధించి పూర్తి వివరాలను యాజమాన్యం ప్రతినిధి సుజిత్‌తోపాటు పలువురు వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేస్తున్న యాజమాన్య ప్రతినిధులు సమీపంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని జడ్పీటీసీ జ్యోతి, మాజీ జడ్పీటీసీ శ్రీరాం ప్రసాద్‌లు కోరారు. అనంతరం సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ గ్రామంలో అనేక మంది రైతులకు సంబంధించి ఇరిగేషన్ పరిధిలోని లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు రహదారుల అభివృద్ధికి సీఎస్ఆర్ నిధులను సమకూర్చాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు రాజేంద్ర, సీఐ సంఘమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ శ్రీకాంత్, మాజీ సీడీసీ చైర్మన్ కట్టా సుధాకర్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భార్యపై కోపంతో అత్తింటికి నిప్పు

కోట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): భార్యతో గొడవపడి ఓ వ్యక్తి అత్త వారింటికి పెట్రోలు పోసి నిప్పు పెట్టిన వైనమిది. అదృష్టవశాత్తూ ప్రాణ నష్టం జరగలేదు. పోలీసుల కథనం ప్రకారం వివరాలివి. చిల్లకూరు మండలం వల్లివేడుకు చెందిన ఏడుకొండలికి కోట మండలం కొత్తపాలేనికి చెందిన శిరీషతో ఐదేళ్ల క్రితం పెళ్లయింది. రెండేళ్ల నుంచి అనుమానంతో భార్యను వేధిస్తున్నాడు. దీంతో ఆమె కొద్దిరోజుల క్రితం పుట్టింటికి వచ్చేసింది. గురువారం ఏడుకొండలు అత్తవారింటికి వచ్చాడు. భార్యతో గొడవ పడి కొట్టాడు. ఆమె కోపంతో మరో గదిలోకి వెళ్లిపోయింది. ఈలోగా ఏడుకొండలు వెంట తెచ్చుకున్న పెట్రోలు తీసి గదిలో పోసి నిప్పంటించాడు. ఇంట్లో వారు గుర్తించి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అయితే గదిలో అప్పటికే రూ.4లక్షల విలువైన ఫర్నిచర్ దగ్ధమైంది. అగ్నిమాపక శకటం వెళ్లి మంటలను ఆర్పివేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

రాయలచెరువు ముంపు బాధితులకు రూ.14.5 లక్షల సాయం

● బైర్గన్ పరిశ్రమ ఉదారత


వరదసాయంతో పాటు వివిధవస్తువులు కలెక్టర్‌కు అందజేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలం ఓళూరు రాయలచెరువు కట్ట తెగిన ఘటనలో ముంపుబారిన పడిన కళత్తూరు హరిజనవాడ, మరో రెండు గ్రామాల బాధితులకు రూ.14.5 లక్షల సాయం అందింది. శ్రీసిటీలోని బైర్గన్ పైప్ సపోర్టు పరిశ్రమ నిర్వాహకులు రూ.10లక్షల సాయంతో పాటు రూ.4.5 లక్షల విలువైన 1,200 ఎల్ఈడీ బల్బులు, 750 దుప్పట్లు, 75 టేబుల్‌ఫ్యాన్లు అందజేశారు. వీటిని ఆ పరిశ్రమ ప్రతినిధి అల్తాఫ్ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందించారు. ఆ పరిశ్రమ ఉదారతను కొనియాడుతూ.. మరికొంతమంది సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చి బాధితులను ఆదుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

‘అరణియార్’లోకి ఆరు లక్షల చేప పిల్లలు


రిజర్వాయర్‌లో చేప పిల్లలు వదులుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టులోకి నీళ్లు చేరడంతో గురువారం ఆరు లక్షల చేపల పిల్లలను వదిలారు. మరో ఐదు రోజుల్లో ఇంకో నాలుగు లక్షల చేప పిల్లలు వదలనున్నారు. ఈ రిజర్వాయరులోని చేపలకు అటు చెన్నై, ఇటు నెల్లూరు, తిరుపతిలో మంచి గిరాకీ ఉందని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే ఆదిమూలం చెప్పారు. ఈ చేపలకు మార్కెట్ కల్పిస్తే మత్స్యకారుల కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, డీఎఫ్‌వో శాంతి, ఎఫ్‌డీవో మధుసూదన్, ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, ఎంపీడీవో మహ్మద్‌రఫీ, అరిణియార్ ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, నాయకులు వాసురెడ్డి, ఎస్.ఎం.సురేష్, సుమాంజలి, మునిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఐసర్‌లో భారత శాస్త్ర అకాడమీ సదస్సు

● 150 మంది శాస్త్రవేత్తల రాక



ఏర్పేడు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని ఐసర్‌లో బెంగళూరుకు చెందిన భారత శాస్త్ర అకాడమీ ఆధ్వర్యంలో 91వ వార్షిక సదస్సు శుక్రవారం నుంచి 16వ తేదీ వరకు జరగనుంది. మూడు రోజుల పాటు తిరుపతి ఐసర్‌లో జరగనుంది. సర్ సీవీ రామన్ 1934లో స్థాపించిన ఈ అకాడమీ.. దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి కృషి చేస్తోంది. ఈ అకాడమీ శాస్త్రీయ ఆలోచన, జ్ఞాన మార్పిడి, విజ్ఞాన విద్య, పరిశోధనలను దేశవ్యాప్తంగా అభివృద్ధి పరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ క్రమంలో జరిగే 91వ వార్షిక సదస్సులో దేశంలోని 150మంది ప్రముఖ శాస్త్రవేత్తలు పాల్గొని.. పరిశోధనలను పరిచయం చేస్తారు. అకాడమీ ఫెలోషిప్ అసోసియేట్లు, పరిశోధకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆహ్వానితులు శాస్త్రీయ చర్చలు, ఆలోచనల మార్పిడి జరుపుతారు. ఐఐఎస్‌సీ బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ ‘వైరల్ వ్యాక్సిన్ల స్థిరత్వం, ప్రభావాన్ని పెంపొదించడం’ అంశంపై అధ్యక్ష ప్రసంగం చేస్తారు. పబ్లిక్ లెక్చర్‌గా ‘ఏఐ ఫర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్’పై ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ కల్యాణ రామన్ మాట్లాడనున్నారు. ప్రత్యేక సింపోజియాలు, లెక్చర్లతో పాటు లీలావతీస్ డాటర్స్ పుస్తకాన్ని కన్నడ, ఒరియా బాషల్లో ఆవిష్కరిస్తారు. విద్యార్థుల కోసం విజ్ఞాన కథలు పేరుతో మధ్య పాఠశాల విద్యార్థుల కోసం విజ్ఞాన అవగాహన కార్యక్రమం 14, 15 తేదీల్లో అవుట్‌రీచ్ కార్యక్రమం ఉంటుంది. అకాడమీ అధికార యూట్యూబ్ ఛానల్ ద్వారా ఈ కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

సదస్సులో నేడు: శుక్రవారం ఉదయ 8.45గంటలకు రిజిస్ట్రేషన్, 9.10 నుంచి 10.30 వరకు బెంగళూరు ఐఐఎస్‌సీ ప్రొఫెసర్ రాఘవన్ వరదరాజన్ అధ్యక్ష ప్రసంగం, 11.45గంటలకు ప్రజా ఉపన్యాసం, 12.30గంటలకు గ్రూప్ ఫొటో, 2 గంటలకు ఫెలోస్ ఉపన్యాసాలు, 3.20గంటలకు టీ విరామం, 4గంటలకు ఫరీదాబాద్ టీహెచ్ఎస్‌టీఐ ప్రొఫెసర్ డాక్టర్ శింజని భట్నాగర్ ఉపన్యాసం, 4.40గంటలకు ప్రత్యేక సమావేశం, 6.10 గంటలకు ఫెలోస్ ఉపన్యాసాలు,

లారీ చోరీ కేసులో క్లీనర్ అరెస్టు


దొంగ అరెస్టును చూపుతున్న డీఎస్పీ

శ్రీకాళహస్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తాను క్లీనర్‌గా పనిచేస్తున్న లారీని డ్రైవర్ లేని సమయంలో చోరీకి పాల్పడ్డ వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి గురువారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. పలమనేరుకు చెందిన మధుసూదన్‌నాయుడు లారీ యజమానిగా వస్తు రవాణా సాగిస్తుంటాడు. శ్రీకాళహస్తి పట్టణం కొత్తపేటకు చెందిన కన్నయ్యనాయుడు ఆ లారీకి డ్రైవర్‌గా, ఇదే పట్టణం బహదూరుపేటకు చెందిన జయచంద్ర(45) క్లీనర్‌గా పని చేస్తుండేవాడు. వారం రోజుల క్రితం నెల్లూరు నుంచి ఖాళీ లారీతో పలమనేరుకు వెళుతూ శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని బసవయ్యపాళెం వద్ద విశ్రాంతి కోసం ఆగారు. ఈ సమయంలో డ్రైవర్ కన్నయ్యనాయుడు ఇంటికి వెళ్లడంతో క్లీనర్ జయచంద్ర లారీని చోరీ చేశాడు. యజమాని మధుసూదన్‌నాయుడు ఫిర్యాదు మేరకు శ్రీకాళహస్తి 2వ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తొట్టంబేడు మండలం కన్నలి ఎస్టీకాలనీ వద్ద గురువారం లారీ సహా క్లీనర్ జయచంద్రను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం

● డిస్కం సీఎండీ శివశంకర్



తిరుపతి(ఆటోనగర్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలోని 9 జిల్లాల వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేసే లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో అధికారులు పనిచేయాలని ఆ సంస్థ సీఎండీ లోతేటి శివశంకర్ ఆదేశించారు. తిరుపతిలోని విద్యుత్ కార్పొరేట్ కార్యాలయంలో గురువారం డిప్యూటీ ఈఈలు, ఈఈలు, ఎస్ఈలు, జీఎం, సీజీఎం స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వినియోగదారులకు అధికారులు అందుబాటులో ఉండి సత్వర సేవలందించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు రాకుండా లోడ్ నియంత్రణపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. డయల్ యువర్ సీఎండీ కార్యక్రమానికి వస్తున్న ఫిర్యాదుల సంఖ్యను తగ్గించాలని చెప్పారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు త్వరితగతిన వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. 11కేవీ ఫీడర్లకు, డీటీఆర్‌లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్నారు. నెలవారీగా విద్యుత్ బిల్లులు 100 శాతం వసూలు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు పి.అయూబ్‌ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహనరావు, సీజీఎంలు జె.రమణాదేవి, ఎన్.శోభావాలింటీనా, ఎం.మురళీకుమార్, ఎం.ఉమాపతి, ఆదిశేషయ్య, జానకిరామ్, సురేంద్రనాయుడు పాల్గొన్నారు.

◆ నా మాటకు విలువలేనప్పుడు

ఎందుకీ ఇన్‌-చార్జి పదవి?

● గంగమ్మ గుడిలో మెంబరునూ వేసుకోలేకపోయా
● టీడీపీ ముఖ్యనేతల ఎదుట సుగుణమ్మ ఆవేదన

తిరుపతి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ‘తాతయ్య గుంట గంగమ్మ గుడిలో ఒక మెంబరునూ వేసుకోలేకపోయా. నాకు సమాచారం లేకుండానే కార్యక్రమాలు చేస్తున్నారు. నా మాటకు విలువ లేనప్పుడు నాకెందుకీ ఇన్‌చార్జి పదవి?’ అంటూ ఏపీ జీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య, నాలెడ్జ్ కమిటీ చైర్మన్ మాల్యాద్రి, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాళెం విజయకుమార్ సమక్షంలో గురువారం తిరుపతిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన క్లస్టర్ ఇంచార్జిలు, కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ‘2019 ఎన్నికల్లో నేను గెలిచానో, ఓడిపోయానో అందరికీ తెలుసు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నిక వైసీపీ అధికారబలంతో రాష్ట్ర వ్యాప్తంగా చేజిక్కించుకుంది. అయితే తిరుపతి నియోజకవర్గాన్నే భూతద్దంలో చూపించారు. అయినా ప్రతిపక్షహోదాలో తిరుపతిలోని కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చాను. 2024లో టికెట్ వస్తుందని ఆశించా. కూటమి పొత్తులో భాగంగా మిత్రపక్షమైన జనసేనకు సీటు పోయింది. ఆ సమయంలో కాస్త అసంతృప్తి చెందిన మాట వాస్తవమే. అవన్నీ పక్కన పెట్టి అందరినీ కలుపుకుని పోయి అత్యధిక మెజారిటీతో కూటమి అభ్యర్థిని గెలిపించుకున్నాం. ఈక్రమంలో వచ్చిన నామినేటెడ్ పోస్టులు కొంత అసంతృప్తి కలిగించాయి. గంగమ్మ గుడిలో మెంబరుగా కూడా నేను సూచించిన వ్యక్తికి రాకపోవడం బాధకలిగింది’ అని సుగుణమ్మ వాపోయారు. వైసీపీ నాయకుల పట్ల కొందరు పోలీసులు వ్యవహరిస్తున్న తీరు చూస్తే అధికారంలో ఎవరున్నారన్న అనుమానం కలుగుతోందని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ అన్నారు. తిరుపతిలో జనసేన ఎమ్మెల్యే కావడంతో టీడీపీ శ్రేణులకు దిక్కులేకుండా పోయిందని సూరా సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. యాదవులంటే ఒకే కుటుంబమేనా? వారికే పదవులా? తిరుపతి టీడీపీలో ఇంకెవరూ లేరా అంటూ బీజీ కృష్ణ యాదవ్ ప్రశ్నించారు.

గ్రూపులు వదిలేయండి.

సుగుణమ్మ, ఆమె అల్లుడు సంజయ్ 2019 ఎన్నిక సరిగ్గా చేసుంటే ఇప్పుడు ఆమె మంత్రి అయ్యేవారని మాల్యాద్రి చెప్పారు. వర్ల రామయ్య మాట్లాడుతూ 2009లో ఎంపీగా పోటీ చేసినప్పుడు 45 నిమిషాలు ముందు చెబితే తాను నామినేషన్ వేశానని గుర్తుచేసుకున్నారు. కొందరి వల్ల ఓడిపోవాల్సి వచ్చిందని చెప్పుకొచ్చారు. గ్రూపులు వదిలేసి అందరినీ కలుపుకుని పోవాలని అటు సుగుణమ్మకు, ఇటు పార్టీ శ్రేణులకు వారు పిలుపునిచ్చారు. తిరుపతి ఇన్‌చార్జి సుగుణమ్మ ఆదేశాల ప్రకారం నాయకులు, కార్యకర్తలు నడుచుకోవాలని సూచించారు.


సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న వర్ల రామయ్య, టీడీపీ నేతలు

‘గ్రేటర్’లో విలీనానికి కరకంబాడి ఓకే

రేణిగుంట/తిరుపతి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనానికి కరకంబాడి పంచాయతీ బోర్డు ఆమోదించింది. కలెక్టర్ ఆదేశాలు మేరకు రేణిగుంట మండలం పరిధిలోని కరకంబాడి, రేణిగుంట, గాజులమండ్యం పంచాయతీల సర్పంచుల అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో పంచాయతీ బోర్డు సమావేశం జరిగింది. ఇందులో కరకంబాడి పంచాయతీ పాలకమండలి కార్పొరేషన్‌లో విలీనానికి ఆమోదించారు. కోరం లేనందున రేణిగుంట పాలకమండలి సమావేశం వాయిదా పడింది.

మేము కలవలేం : తిరుపతిరూరల్‌మండలం రామానుజపల్లె పంచాయతీకార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో గ్రామసర్పంచ్, వార్డుసభ్యులు కలసి గ్రేటర్‌తిరుపతిలో విలీనానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. గ్రామపంచాయతీగానే ఉంచాలని కోరారు.గ్రేటర్‌లో విలీనం చేయడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై పన్నులభారం పెరుగుతుందని, పలు సమస్యల కోసం కార్పొరేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. ఈ మేరకు తీర్మాన పత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. సర్పంచ్ లీలారాణి, వైస్‌సర్పంచ్, వార్డుసభ్యులు, కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు. రేణిగుంట మండలం గాజులమండ్యం పంచాయతీ పాలకమండలి కూడా కార్పొరేషన్‌లో విలీనాన్ని తిరస్కరించింది.

నెరవేరిన చంద్రబాబు హామీ



చకచకా సాగుతున్న తారురోడ్డు పునర్నిర్మాణపు పనులు

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం ఏడో మైలు క్రాస్ నుంచి రాళ్లబూదుగూరు మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు గల రహదారి అధ్వానంగా మారి మండల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. దశాబ్దకాలంగా ఇదే పరిస్థితి. గత ఏడాది ఎన్నికల సందర్భంగా రాళ్లబూదుగూరుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు ప్రజలు ఈ రహదారి దుస్థితిని వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రహదారిని బాగు చేస్తామని అప్పట్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఇటీవల రహదారి బాగు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4.5కోట్లను మంజూరు చేసింది. మూడు రోజుల క్రితం రహదారి పనులు ప్రారంభమై చకచకా సాగుతున్నాయి. ఇచ్చిన హామీ మేరకు రహదారి బాగుకు చర్యలు తీసుకున్న సీఎం చంద్రబాబుకు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు, మండల నాయకులకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

ట్రాక్టర్ కింద పడి కూలీ దుర్మరణం



ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన రామచంద్ర, పక్కన (ఫైల్‌ఫొటో)

సోమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కింద పడి కూలీ దుర్మరణం చెందాడు. ఈ ఘటన సోమల మండలంలో జరిగింది. సోమల ఎస్ఐ శివశంకర కథనం మేరకు.. పేటూరు పంచాయతీ బోనమందకు చెందిన రామచంద్ర పదేళ్లగా మురళీనాయుడు మామిడి తోటలో కూలీగా పనిచేస్తున్నాడు. మామిడి తోటలను తమిళనాడుకు చెందిన కృష్ణగిరి షాజహాన్ లీజుకు తీసుకున్నాడు. ఈక్రమంలోనే మామిడి తోటను దుక్కి చేయడానికి ట్రాక్టర్ డ్రైవర్ కందసేన్ వచ్చాడు. డ్రైవర్ పక్కనే కూలీ రామచంద్ర కూర్చున్నాడు. దుక్కి చేస్తుండగా గుంతలో దిగి ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్ పక్కకు దూకేయడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. రామచంద్ర ట్రాక్టర్ కింద పడి పోవడంతో అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడి భార్య రేఖ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహాన్ని పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, ఓ కుమారుడు ఉన్నాడు.

జైళ్లశాఖ డీజీని కలిసిన ఎస్పీ



చిత్తూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ అంజనీకుమార్‌ను ఎస్పీ తుషార్ మర్యా దపూర్వకంగా కలిశారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి వచ్చిన డీజీపీకి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఫిజికల్ ఫిట్‌నెస్‌ని గమనించి డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే ఏఎస్పీ రాజశేఖర్‌రాజు కూడా డీజీపీని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

వరసిద్ధుడి సేవలో...



అంజనీకుమార్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ అంజనీకుమార్ గురువారం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఏఈవో రవీంద్రబాబు, చిత్తూరు జైలు సూపరింటెండెంట్ వెంకటరెడ్డి, డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్‌నాయుడు, ఆలయ సూపరింటెండెంట్ వాసు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని అమరరాజ ఉద్యోగి దుర్మరణం



సంఘటనా స్థలంలో మృతదేహం, గిరిబాబు (ఫైల్ ఫొటో)

ఐరాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాహనం ఢీకొనడంతో అమరరాజ ఉద్యోగి ఒకరు దుర్మరణం చెందాడు. ఐరాల పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఐరాల మండలంలోని పొలకలరెడ్డివారిపల్లె బీసీ కాలనీకి చెందిన గిరిబాబు(29) యాదమరి మండల పరిధిలోని అమరరాజ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం డ్యూటీ ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. గ్రామ సమీపానికి వద్దకొచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. భార్య దీప ఫిర్యాదుతో పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

'విశాఖ' ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లో పొగలు

- గంట ఆలస్యంగా బయల్దేరిన రైలు

తిరుపతి(సెంట్రల్), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి విశాఖ వెళ్లే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్(08548) ఏసీ కోచ్‌లో పొగలు వచ్చాయి. ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. విశాఖ నుంచి ఈ ప్రత్యేక రైలు గురువారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకొంది. తిరిగి తిరుపతి రైల్వే స్టేషన్‌లో రాత్రి 9.50 గంటలకు 6వ నెంబరు ప్లాట్ ఫారం నుంచి బయలుదేరాలి. రైలు బయలుదేరిన వెంటనే బి-3 ఏసీ కోచ్‌లో సిబ్బంది ఏసీ ఆన్ చేశారు. ఆన్ చేసిన వెంటనే ప్యానల్ బోర్డులో ఉన్నపళంగా పొగలు రావడంతో ఏసీ సిబ్బంది, ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. సిబ్బంది చాకచక్యంగా చైన్‌పుల్ చేసి రైలును ఆపారు. ఎలాంటి మంటలు చెలరేగక పోవడంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు, ఎలక్ట్రికల్, ఇతర సాంకేతిక శాఖల సిబ్బంది అక్కడకు చేరుకొని మరమ్మతులు చేశారు. ఈ రైలు గంటకుపైగా ఆలస్యంతో బయలుదేరినట్లు ప్రయాణికులు తెలిపారు.

ముక్కంటి సేవలో నటి స్నేహ



శ్రీకాళహస్తి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని గురువారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. ఉత్తరప్రదేశ్ ఎంపీ హరీష్ ద్వివేది, సినీనటి స్నేహ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రొవిజినల్ మెరిట్ జాబితా ప్రకటన ఎప్పుడు?

- అభ్యర్థుల్లో ఎన్నో అనుమానాలు
- 56 పోస్టులకు 2,093 దరఖాస్తులు

చిత్తూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేయడానికి 56 పోస్టులకు గతనెల తొమ్మిదో తేదీన నోటిఫికేషన్ విడుదల చేశారు. దరఖాస్తులు స్వీకరణకు అదేనెల 22వ తేదీన గడువు విధించారు. 56 పోస్టులకు 2,093 దరఖాస్తులు అందాయి. ఈనెల ఏడో తేదీన ప్రొవిజినల్ మెరిట్ జాబితా విడుదల.. 15న గ్రీవెన్స్‌కు అవకాశం కల్పించి.. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 20వ తేదీన అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తామని నోటిఫికేషన్‌లో ప్రకటించారు. 14వ తేదీ వచ్చినా ప్రొవిజినల్ మెరిట్ జాబితా ఊసేలేదు.

విజయవాడకెళ్లిన డీఎంహెచ్‌వో

నోటిఫికేషన్ ప్రకటించినప్పటి నుంచి ఎన్నో అనుమానాలు అభ్యర్థుల్లో నెలకొన్నాయి. ఎన్నడూ లేనివిధంగా ఈసారి కులంతో సంబంధం లేకుండా అందరికీ రూ.500 అప్లికేషన్ ఫీజును సైతం వసూలు చేశారు. 2,093 దరఖాస్తుల ద్వారా జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు రూ.10,46,500 ఆదాయం చేకూరింది. ఇటీవల సెంట్రల్ టీం పర్యటన అనంతరం బ్రీఫింగ్ కోసం డీఎంహెచ్‌వోను కేంద్ర బృందం విజయవాడకు పిలిపించారు. అక్కడ ఈ నోటిఫికేషన్‌పై చర్చలు జరిగినట్లు సమాచారం. ఎవరిని అడిగి నోటిఫికేషన్ విడుదల చేశారు.. వారికి జీతాలు ఎవరిస్తారని ఆగ్రహించినట్లు తెలిసింది.

ఒక్కో పోస్టుకు 37 మంది పోటీ

56 పోస్టులకు 2093 దరఖాస్తులు అంటే.. ఒక్కో పోస్టుకు 37 మంది పోటీలో ఉన్నట్లు అన్నమాట. దీంతో పైరవీలు కూడా అదే స్థాయిలోనే ఉన్నాయి. ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎంపీల నుంచి వివిధ స్థాయిల నాయకుల నుంచి వందల్లో సిఫారసు లెటర్లు వచ్చినట్లు సమాచారం. అంతేకాకుండా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పోస్టుకు తగ్గట్టుగా రేటు పలుకుతున్నట్లు జిల్లాలో టాక్ నడుస్తోంది.

- **పోస్టులు.. దరఖాస్తులిలా..**

మెడికల్ ఆఫీసర్లు 13 పోస్టులకు 97 దరఖాస్తులు వచ్చాయి. అలాగే స్టాఫ్ నర్స్ 20 పోస్టులకు 1374, ఫైనాన్స్ కమ్ లాజిస్టిక్ కన్సల్టెంట్ ఒక పోస్టుకు 45, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 3కి 142, ఫిజియోథెరపిస్ట్ ఒక పోస్టుకు 50, శానిటరీ అటెండెంట్ రెండు పోస్టులకు 47, సపోర్టింగ్ స్టాఫ్ నాలుగు పోస్టులకు 139, రెండు సెక్యూరిటీ గార్డు పోస్టులకు 43, లాస్ గ్రేడ్ సర్వీసెస్ ఎనిమిది పోస్టులకు 156 దరఖాస్తులు వచ్చాయి. ఆడియో మెట్రి రెండు పోస్టులుంటే ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.



డీఎంహెచ్‌వో కార్యాలయం

పొలాల్లో గజరాజుల బీభత్సం

- కొబ్బరి, మామిడి, వక్కచెట్లు, అనప పంట ధ్వంసం



ఏనుగుల మంద దాడిలో ధ్వంసమైన వరిపంట, వక్క చెట్లు, మామిడిచెట్టు కొమ్మలను విరిచేసిన ఏనుగులు

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. రాత్రి వేళలో పొలాల్లోకి ప్రవేశిస్తున్న ఏనుగుల మంద బీభత్సం సృష్టిస్తున్నాయి. మండలంలోకమ్మపల్లి పంచాయతీలో బుధవారం రాత్రి వరి, కొబ్బరి, మామిడి, వక్క, అనప పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల మంద బాలిరెడ్డిగారి పల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతులు మోహన్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, తిమ్మారెడ్డికి చెందిన వరి, కొబ్బరి, మామిడిచెట్లను ఏనుగుల మంద ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి పొలాల వెంబడి దేశిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకుంది. రైతులు రవీంద్రారెడ్డి, కేశవులురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సిద్దారెడ్డి, చంద్రారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డికి చెందిన వరి, కొబ్బరి, మామిడి, వక్కచెట్లను విరిచేశాయి. అనప పంటను తొక్కేశాయి. పొలానికి సమీపంలోని బండపై ఉన్న రైతు నారాయణరెడ్డికి చెందిన వరికుప్పను చెల్లాచెదురుచేశాయి. జాంద్రపేటలోని రైతు వెంకట్రామయ్యకు చెందిన మామిడి, అరటి, పశుగ్రాసం తినేసి అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. గురువారం పగలంతా అడవిలోని చింతలవంక వద్ద 16 ఏనుగులమంద సంచరించినట్లు అటవీ సిబ్బంది తెలిపారు.

మళ్లీ కొత్తూరుకు ఏనుగులు.. రైతుల్లో భయాందోళన

సోమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో బుధవారం రాత్రి కొత్తూరు సమీపంలోని మనోహర్‌రాజు వరి పొలంలో ఏనుగుల పడ్డాయి. పంటను, డ్రిప్ పైపులను తొక్కేశాయి. సమీప పొలం వద్ద రైతులు మంటలు వేసుకుని ఉండడంతో ఏనుగులు పులిచెర్ల మండలం వైపు ఏనుగులు మళ్లాయి. అయితే అవి మళ్లీ మండలంలోకి ప్రవేశించాయి. దీంతో నెల రోజులుగా ఏనుగుల దాడులు లేకపోవడంతో ప్రశాంతంగా రైతులు మళ్లీ దిగాలు పడ్డారు. రెండు నెలలు క్రితం టమోటా తోట వద్ద ఉన్న రైతు రామకృష్ణంరాజును ఏనుగులు చంపేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎప్పుడు ఏ పొలంలో పడుతాయోనని కంటి మీద కునుకు లేకుండా కాపుకాస్తున్నారు.

బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలి

సోమల మండలంలోని ఆవులపల్లె, చిన్నఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పంచాయతీల్లో తరచూ మకాం వేస్తున్నాయి. సుమారు 4 వేల ఎకరాల్లో మామిడి, వందల ఎకరాల్లో టమోటా సాగు ఉంది. అన్నెమ్మగారిపల్లె సమీపంలోని కనికలచెరువు, చిన్నఉప్పరపల్లె పంచాయతీలోని చెరువుకోన, కొత్తూరు సమీపంలోని కోనమూలలో నీటి సౌకర్యం ఉండడంతో రాత్రి మకాం వేయడానికి అనువుగా ఉంది. ఈప్రాంతంలో తరుచూ ఏనుగులు సంచరిస్తుండడంతో సమీప రైతులు వరి, చెరుకు సాగు చేయడం తగ్గించారు. ఏనుగుల దాడుల నివారణకు బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



కొత్తూరు వద్ద ఏనుగులు సంచరించిన వరి పొలం

అలిపిరి పాదాల మండపానికి పూర్వ వైభవం

- సందర్శించిన ఏఎస్ఐ బృందం
- త్వరలో ప్రారంభంకానున్న పునర్నిర్మాణం పనులు



తిరుమల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అలిపిరిలో కూలిపోయే స్థితిలోవున్న పాదాల మండపం ప్రాచీనవైభవం చెక్కుచెదరకుండా పునర్నిర్మాణానికి తొలి అడుగు పడింది. గురువారం ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) అధికారుల బృందం దీనిని పరిశీలించింది. ప్రత్యేక శ్రద్ధతో, శాస్త్రీయ పద్ధతిలో అవే రాళ్లు, స్తంభాలు వినియోగించే మండపాన్ని పునర్నించవచ్చని ఏఎస్ఐ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి ఆధ్వర్యంలోని బృందం అభిప్రాయపడింది. ఇందుకు రూ. 4కోట్లు వ్యయం కావచ్చని అంచనా వేశారు. పూణేకు చెందిన లార్డ్ వేంకటేశ్వర ఛారిటబుల్ అండ్ రిలీజియస్ ట్రస్టు నిర్వాహకులు వెంకటేశ్వరరావు ఈ మొత్తం భరించేందుకు ముందుకు వచ్చారు. శ్రీకాళహస్తిలో రూ.7 కోట్లతో లీకేజీ పనులు, సింహాచలం, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాల్లో మరమ్మతు పనులను పురాతన పద్ధతిలో ఇప్పటికే వీరి ఆధ్వర్యంలో జరిగాయి. పాదాలమండపాన్ని పరిశీలించిన ఏఎస్ఐ బృందంలో బెంగుళూరు డిప్యూటీ ఇంజినీర్ జీ శ్రీనివాసులు, హైదరాబాద్ డిప్యూటీ ఇంజినీర్ కృష్ణచైతన్య కూడా ఉన్నారు. 450 ఏళ్ల క్రితం విజయనగర రాజుల కాలంలో పాదాల మండపాన్ని నిర్మించారు. పదేహేనేళ్లుగా రాళ్లు, పైపెచ్చులు, గోడలు పడిపోతూ ప్రమాదకరంగా మారింది. దీని స్థానంలో కొత్తది నిర్మించాలా, మరమ్మతులు చేయాలా అనే చర్చ జరిగింది. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ అధికారులు ఆర్కియాలజీ విభాగం సంప్రతించడంతో ఈ బృందం తిరుపతికి వచ్చింది.

ఒక్క ఇటుకా కదిలించం



పాదాల మండపాన్ని పూర్తిగా కూలదోసి కొత్తది కడతారనే ప్రచారం నిజం కాదు. ప్రస్తుతం ఉన్న నిర్మాణంలోంచి ఒక్క ఇటుకను కూడా కదిలించబోము. ఇందులోని ప్రతీ రాయినీ, స్తంభాన్నీ యధాతధంగా వినియోగించుకుంటాం. వాటిపై నెంబర్లు వేసి తిరిగి వాటితోనే నిర్మాణం జరుగుతుంది. దాత కూడా ముందుకువచ్చారు. విధివిధానాలు పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం. పనులు పూర్తయితే మరో 700 ఏళ్ల దాకా అలిపిరి పాదాలమండపానికి ముప్పు ఉండదు.

- మునిరత్నంరెడ్డి, ఏఎస్ఐ డైరెక్టర్

ముసుగేసిన మంచు



తిరుపతి అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరాన్ని పొగమంచు కప్పేసింది. గురువారం ఉదయం మరింత ఎక్కువగా మంచు కనిపించింది. ఈ మంచు చాటున శేషాచల కొండ, గరుడవారధి, రహదారులు, రైల్వేట్రాక్, బహుళ అంతస్తుల భవనాలు, వాహనాల రాకపోకలు కనువిందుచేశాయి. మంచుతెరల్లో బాల సురీడు రూపం అలరించింది. చలి కాస్త పెరిగింది. ఉదయం 10 గంటల తర్వాత పొగమంచు వీడి యధావిధి వాతావరణం నెలకొంది.



స్వామి దర్శనంతో ప్రశాంతత



తిరుమల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 'తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రతిసారి ప్రశాంతత లభిస్తుంది. పీస్ ఆఫ్ మైండ్‌తో తిరిగి ఇంటికి వెళతాం' అని నటి అంజలి అన్నారు. నటుడు శ్రీనివాసరెడ్డితో కలిసి గురువారం ఉదయం ఆమె స్వామిని దర్శించుకున్నారు. తన సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామన్నారు. శ్రీవారి నిజరూప దర్శనం చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని నటుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రసాదాలు చాలా బాగున్నాయన్నారు. ఆలయం ముందు వీరిని చూసేందుకు సినీ అభిమానులు పోటీపడ్డారు. సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.

164 అదనపు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో 164 అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రాష్ట్ర ఎన్నికల అధికారికి ఆమోదం కోసం పంపినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం వివిధరాజకీయ పార్టీల నేతలతో పోలింగ్ కేంద్రాల సరళీకరణపై ఆయన సమీక్షించారు. 1,200 ఓటర్లు దాటిన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఈ ప్రతిపాదనలు పంపామన్నారు. 38 పోలింగ్ కేంద్రాల ప్రాంతాలు మార్పు, 9 పోలింగ్ కేంద్రాలు పేరుమార్పు, 44 పోలింగ్ కేంద్రాలు విలీనానికి ప్రణాళికలు సిద్ధంచేశామన్నారు.

మెడికల్ కాలేజీలపై వైసీపీ అసత్య ప్రచారం

- ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీలపై వైసీపీ అసత్య ప్రచారం చేస్తోందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెడికల్ కాలేజీల నిర్మాణం, సీట్ల విషయంలో గత వైసీపీ ప్రభుత్వ అమలు చేసిన విధానంలో వెళితే కాలేజీలు అందుబాటులోకి రావడానికి సుమారు 15సంవత్సరాల సమయం పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన పీపీపీ విధానంలో అయితే రెండేళ్లలోనే 10 మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రాష్ట్ర విద్యార్థులకు 220మెడికల్ సీట్లు, అందుబాటులోకి వస్తాయని, ఇందులో 110సీట్లు పేద, మధ్యతరగతి విద్యార్థులకు అదనంగా పెరుగుతాయన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యసేవలు అందుబాటులోకి తేవాలని సీఎం చంద్రబాబు కృషిచేస్తుంటే వైసీపీ నేతలు అసత్య ప్రచారాలతో, కుట్రపూరితంగా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్పీ రాజశేఖరరాజు



ప్రసంగిస్తున్న ఏఎస్పీ రాజశేఖరరాజు

చిత్తూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల యువత, మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్పీ రాజశేఖరరాజు చెప్పారు. గురువారం చిత్తూరులోని సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి.. మత్తు పదార్థాల వాడకంతో వాటిల్లే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వాడకంతో భవిష్యత్తు నాశమవడమే కాకుండా అతడిని నమ్ముకున్న కుటుంబం కూడా రోడ్డున పడుతుందన్నారు. ఇక తెలియని లింకులు, అనుమానాస్పద సందేశాలను ఎలాంటి పరిస్థితుల్లోనూ నమ్మకూడదన్నారు. శక్తియాప్ ద్వారా అత్యవసర సమయాల్లో తక్షణసాయం పొందవచ్చన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. ఒకటో పట్టణ సీఐ మహేశ్వర, క్రైమ్ ఎస్ఐ హరినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

- తప్పిన పెనుప్రమాదం
- ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి'



గుడిపాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలోని డివైడర్‌పైకి గురువారం ఉదయం ఓ లారీ దూసుకెళ్లింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ డివైడర్ ప్రమాదకరంగా ఉందని 'ఆంధ్రజ్యోతి' ముందే హెచ్చరించింది. 190 రామాపురం సీఎంసీ ఆస్పత్రి వద్ద డివైడర్లను ఏర్పాటు చేసి ఎలాంటి సూచిక బోర్డును పెట్టలేదు. దాంతో ఓవర్‌టేక్ చేసే క్రమంలో డివైడర్‌ని డ్రైవర్ గుర్తించక పోవడంతో దానిపైకి లారీ దూసుకెళ్లింది. ఈ డివైడర్ ప్రమాదకరంగా ఉందని, సీఎంసీకి వచ్చే రోగులు కూడా వీటిని దాటడానికి ఇబ్బంది పడుతున్నారని వారం కిందటే ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. అయినా అధికారులు పట్టించుకోక పోవడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెటింగ్ శాఖ ఆదాయాన్ని పెంచాలి : ఆర్జేడీ



ప్రసంగిస్తున్న సుధాకర్

చిత్తూరు సెంట్రల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్కెటింగ్ శాఖ ఆదాయం పెంచాలని కడప ఆర్జేడీ సుధాకర్ సూచించారు. గురువారం మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో డీడీ లావణ్య, ఏడీ పరమేశ్వర్‌తో కలిసి జిల్లాలోని మార్కెట్ కమిటీల కార్యదర్శులతో పలు అంశాలపై సమీక్షించారు. సోమల, రొంపిచెర్ల, ఎస్‌ఆర్‌పురం, పెనుమూరు, నగరి కమిటీల్లో ఆదాయం దారుణంగా పడిపోయిందన్నారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి ప్రయత్నాలు చేయాలని పలు సూచనలిచ్చారు. డిసెంబరు నుంచి నాలుగు నెలల పాటు విజిలెన్స్ డ్యూటీలు ఉంటాయని గుర్తుచేశారు. మార్కెట్ యార్డు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూనే ఆడిట్ పూర్తి చేయాలని చెప్పారు. తమిళనాడు నుంచి ధాన్యం జిల్లాకు రాకపోవడంతో కొంత మేర ఆదాయం తగ్గిందన్నారు.

రామకుప్పం-2 క్లస్టర్ కో-ఇన్‌చార్జిగా శంకర్‌చలం



రామకుప్పం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రామకుప్పం-2 క్లస్టర్ కో-ఇన్‌చార్జిగా గోవిందపల్లెకు చెందిన యువనాయుడు శంకర్‌చలం నియమితులయ్యారు. గురువారం కుప్పంలో జరిగిన పార్టీ కార్యవర్గాల ప్రమాణస్వీకారోత్సవంలో శంకరచలంను నియమిస్తున్నట్టు ఎమ్మెల్సీ శ్రీకాంత్ ప్రకటించి అభినందించారు.

బోయకొండ చైర్మన్ పదవి కడియాల మనోహర్‌కు ఇవ్వండి



మాధవ్‌తో మాట్లాడుతున్న లోకేష్, మనోహర్ తదితరులు

చౌడేపల్లె, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ చైర్మన్ పదవిని బీజేపీ చౌడేపల్లె మండలాధ్యక్షులు కడియాల మనోహర్‌కు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌ను నియోజకవర్గం బీజేపీ నాయకులు కోరారు. గురువారం తిరుపతిలో ఆయన్ను బీజేపీ నాయకులు కలిశారు. కడియాల మనోహర్ ఆయనను శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాస్ లోకేష్ మాట్లాడుతూ రాజంపేట ఎంపీ సెగ్మెంట్లో బీజేపీకి ఎక్కువ ఓట్లు వచ్చింది చౌడేపల్లె మండలంలోనే అని వివరించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్లి బోయకొండ చైర్మన్ పదవి కడియాల మనోహర్‌కు వచ్చేలా చూస్తానని మాధవ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



మండల సమావేశంలో పాల్గొన్న నాయకులు, అధికారులు

బైరెడ్డిపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నిశాఖల అధికారులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషిచేయాలని బైరెడ్డిపల్లె ఎంపీపీ రెడ్డెప్ప కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు జరిగేలా వైద్యసిబ్బంది తగిన శ్రద్ధ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్య లేకుండా గ్రామకార్యదర్శులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు స్పందించాలని సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ కేశవులు, ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

పలమనేరు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయంలో నవంబరు14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం కానున్నాయని గ్రంథాలయ అధికారి హేమకుమార్ తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం



కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి బీసీ కాలనీకి చెందిన విమల అనే మహిళ గత సోమవారం హత్యకు గురైన విషయతం పాఠకులకు విదితమే. మృతురాలు విమల కుటుంబం పేదరికంలో ఉండటం, టీడీపీ సానుభూతిపరులు కావడంతో ఈమె కుటుంబానికి ఆర్థికసాయం అందజేయాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి స్థానిక టీడీపీ నాయకులను ఆదేశించారు. ఆ మేరకు టీడీపీ నాయకులు గురువారం సాయంత్రం మృతురాలు కుమార్తె కోమలకు రూ.15వేలు నగదును అందజేశారు. రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు రామనాథంనాయుడు, విండో అధ్యక్షులు ధనంజయనాయుడు, టీడీపీ నాయకులు గోపినాయుడు, ధనంజయ నాయుడు, రవినాయుడు, జయచంద్ర నాయుడు, పార్థసారథినాయుడు, రాజేష్‌నాయుడు, ప్రభాకర్, దేవేంద్ర, రాజగోపాల్‌నాయుడు, జనార్ధన్‌రెడ్డి, తేజనాయుడు పాల్గొన్నారు.

నేడు రైతులకు యూరియా పంపిణీ

సోమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) సోమల రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు శుక్రవారం యూరియా పంపిణీ చేస్తామని వీఏవో చాందినీప్రియ తెలిపారు. ● నడింపల్లె పంచాయతీ రైతులకు రైతు సేవా కేంద్రంలో పంపిణీ చేస్తామని సర్పంచు వెంకటరమణ తెలిపారు.

గంగవరం మండల టీడీపీ కమిటీ ఏకగ్రీవం






అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి

గంగవరం, నవంబరు13 (ఆంధ్ర జ్యోతి): గంగవరం మండల టీడీపీ నూతన కమిటీ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపికైనట్లు మండల టీడీపీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్ తెలిపారు. నూతన కమిటీలో మండల అధ్యక్షులుగా సోమశేఖర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్‌రెడ్డి, మండల క్లస్టర్ ఇన్‌చార్జులుగా ప్రసాద్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, మండల యూనిట్ ఇంచార్జులుగా హరిబాబు, బాలాజి, జయసింహ, మండల ఐటీడీపీ అధ్యక్షులుగా యుగంధర్‌నాయుడు, మండల యూత్ ప్రసిడెంట్‌గా గిరిధర్‌గోపాల్, ఎస్సీసెల్ అధ్యక్షులుగా రవితో పాటు పలువురిని ఏకగ్రీవంగా ఎంపికయ్యారని వివరించారు.

వైభవంగా కార్తీక దీపోత్సవాలు



రామకుప్పం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గరువారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయం వద్ద, వెనుక గల త్రిమూర్తి, నక్షత్ర, నవగ్రహ, రాశీ వనాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక దీపాలతో ఆలయ పరిసరాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

పోలేరమ్మ ఆలయ పునరుద్ధరణకు విరాళాలు

సోమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం కరకమంద వద్ద పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు విరాళం అందజేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సూరయ్యగారిపల్లె, నడింపల్లె, కరకమంద గ్రామస్తులు కరక మంద సమీపంలోని పురాతన పోలేరమ్మ ఆలయ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. ఈక్రమంలోనే సూరయ్యగారిపల్లె గ్రామస్తులు రూ.1,65,000 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. అలాగే కరకమందకు చెందిన మారసాని చంద్రశేఖర్ కుమార్తె శారద, మునిగంగయ్యలు రూ. 2లక్షలతో ఆలయంలో గ్రానైట్ పనులకు శ్రీకారం చుట్టారు. ఆశా కార్యకర్త జ్యోతి రూ. 5016, నడింపల్లెకు చెందిన వెంకటరమణాచారి రూ. 5016 విరాళాంగా అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బురుజుపల్లెలో శాస్త్రోక్తంగా హోమాలు

సోమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం నెల్లిమంద పంచాయతీ బురుజుపల్లెలో కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం గణపతి పూజ, విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, కలశారాధన, ప్రధాన కలశ మండపారాధన, వాస్తు పర్యగ్నికరణం, గణపతి హోమం, వాస్తు హోమం, మహామంగళ హారతి కార్యక్రమాలు జరిపారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంకీర్తలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం రమేష్‌నాయుడు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి కల్యాణోత్సవం జరుపనున్నారు.

దోమల నిర్మూలన అందరి బాధ్యత

కల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దోమల నిర్మూలన మనందరి బాధ్యతని పీలేరు మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్ తెలిపారు. పులిచెర్ల మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాఫూలే గురుకుల బాలికల పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వలన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు జ్వరాలు వస్తాయన్నారు. విద్యార్థులు రాత్రి వేళలో దోమతెరలు వాడాలని, వేడిచేసిన నీటిని తాగాలన్నారు. పాఠశాల ప్రహరీ వెనుక వైపు ఉన్న మురికిగుంతల్లో దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్ వేశామని తెలియజేశారు. వైద్య సిబ్బంది చంద్రయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): భూతగాధలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పుంగనూరు పట్టణంలోని ఎన్‌జీవో కాలనీకి చెందిన అల్తాఫ్‌బాషా, అతని భార్య షేబీనాబేగంలు చౌడేపల్లె మండలం వడ్డివారిపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు సురేశ్‌రెడ్డి భూవివాదంలో ఘర్షణ పడ్డారు. ఇరువర్గాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

రేషన్‌డీలర్ల నోటిఫికేషన్ ఇవ్వాలి



సోమల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వాలని పౌరసరఫరాల శాఖామాత్యులు నాదెండ్ల మనోహర్‌ను సోమల ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులునాయుడు కోరారు. గురువారం అన్నమయ్య జిల్లా మదనపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం సందర్భంగా మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వినతిపత్రం అందజేశారు. బాబురావ్, శివయ్యనాయుడు, సతీశ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారం

ఉత్సాహంగా తెలుగు తమ్ముళ్ల ర్యాలీ



కుప్పంలో ర్యాలీగా వెళుతున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

కుప్పం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కుప్పం మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షులుగా కాణిపాకం వెంకటేష్, కుప్పం రూరల్ అధ్యక్షులుగా రాజగోపాల్, రామకుప్పం మండల అధ్యక్షులుగా వెంకటరమణ, గుడిపల్లె అధ్యక్షులుగా సుబ్రమణ్యం, శాంతిపురం అధ్యక్షులుగా ఉదయ్‌కుమార్ నియమితులయ్యారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో టీడీపీ నూతన అధ్యక్షులు, వివిధ అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకారోత్సం అట్టహాసంగా నిర్వహించారు. గురువారం సెగ్మెంట్‌లోని నాలుగు మండలాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన టీడీపీ శ్రేణులు చెరువు కట్ట వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి డప్పు వాయిద్యాలు, బాణసంచా వేడుకల నడుమ పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీగా తరలి వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్, ఆర్టీసీ రీజనల్ వైస్ చైర్మన్ పీ.ఎస్.మునిరత్నంలు నూతన అధ్యక్షులు, ఇతర కమిటీల ప్రతినిధుల చేత ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పదవులు పొందిన ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పార్టీ అభివృద్ధికి దోహదపడాలన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబుకు లక్ష ఓట్ల మెజారిటీ రావడానికి కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందన్నారు. గత వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసకాండను ఎదురొడ్డి నిలబడిన తెలుగుదేశం పార్టీ శ్రేణుల సేవలను అభినందించారు. ప్రమాణ స్వీకారోత్స కార్యక్రమానికి నాలుగు మండలాల నుంచి భారీ ఎత్తున తరలి వచ్చిన టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రెస్కో చైర్మన్ ప్రతాప్, ఏఎంసీ చైర్మన్ మునిరాజు, కడా సభ్యులు రాజ్‌కుమార్, రాష్ట్ర డైరెక్లర్లు ప్రేమ్‌కుమార్, మణి, బాబునాయుడు, మునస్వామి, విశ్వనాథ్‌నాయుడు, తిరుమగల్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, నాయకులు రాజగోపాల్, కాణిపాకం వెంకటేష్, రమణ, ఉదయ్‌కుమార్, సుబ్రమణ్యం, సత్యేంద్రశేఖర్, డా.సుధీర్, చంద్రశేఖర్, రవికుమార్, నాలుగు మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ కార్యవర్గాల ప్రమాణస్వీకారాలు



పలమనేరు టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న కార్యకర్తలు

పలమనేరు, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మండలాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ కేంద్ర కార్యాలయం నుంచి ఈనెల 13, 14 తేదీల్లోపు నూతన కమిటీలను ప్రకటించాలని ఆదేశాలు వచ్చాయి. దీంతో నూతన కమిటీలతో ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఇప్పటికే వి.కోట మండల కమిటీ ప్రమాణ స్వీకారం వారం క్రితం జరిగింది. ఈ క్రమంలో పలమనేరు పట్టణం, మండలం, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి పాలక వర్గాల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం జరిగింది. బైరెడ్డిపల్లి మండలానికి సంబంధించి అక్కడ మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరగ్గా, పలమనేరు టీడీపీ కార్యాలయంలో గంగవరం, పెద్దపంజాణి, పలమనేరు రూరల్ పాలకవర్గాల ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఇక పట్టణ కమిటీ స్వీకారం స్థానిక మదనపల్లి రోడ్డులోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగింది. పలమనేరు పట్టణ టీడీపీ అధ్యక్షులుగా ఆర్బీసీకుట్టి, ప్రధానకార్యదర్శిగా గిరిబాబు, ఉపాధ్యక్షులుగా రూపేష్‌లు తమ కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేశారు. గంగవరం మండల పార్టీ అధ్యక్షులుగా సోమశేఖర్ గౌడు, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్‌రెడ్డి, బైరెడ్డిపల్లి మండల పార్టీ అధ్యక్షులుగా కిషోర్‌గౌడ, ప్రధానకార్యదర్శిగా సుబ్రహ్మణ్యంశెట్టి, పలమనేరు మండల పార్టీ అధ్యక్షులుగా నాగరాజరెడ్డి, ప్రధానకార్యదర్శిగా గణేష్ , పెద్దపంజాణి మండల పార్టీ అధ్యక్షులుగా ఆనంద్, ప్రధానకార్యదర్శిగా చలపతి తమ కార్యవర్గంతో ప్రమాణ స్వీకారాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు నూతన పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కోలాహలంగా టీడీపీ కార్యవర్గ ప్రమాణస్వీకారం



టీడీపీ నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

బైరెడ్డిపల్లె, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె మండల టీడీపీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం గురువారం స్థానిక రాయల్ మహల్‌లో కోలాహలంగా జరిగింది. టీడీపీ మండలాధ్యక్షుడుగా కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శిగా సుబ్రహ్మణ్యంశెట్టి ప్రమాణస్వీకారం చేశారు. అలాగే మండలంలోని వివిధ పంచాయతీలకు ఎన్నికైన గ్రామకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అధ్యక్షుడుగా ఎన్నుకున్న పార్టీశ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆశీస్సులతో టీడీపీని మరింత బలోపేతం చేసి పార్టీ అభివృద్ధికి తన శాయశక్తులా కృషిచేస్తానని పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని పంచాయతీల్లో టీడీపీని విజయపథంలో నడిపించడానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. అనంతరం కార్యవర్గాన్ని పార్టీకార్యకర్తలు సన్మానించారు.

ఉనికి కాపాడుకోవడానికే వైసీపీ ఆందోళనలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

పుంగనూరు రూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు తమ ఉనికి కాపాడుకోవడానికి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ఆందోళనలు చేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తుంటే ఓర్వలేక ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో మెడికల్ కాలేజీలు తీసుకువచ్చినట్లు చెబుతున్న వైసీపీ నాయకులు ఒక్క చోటైనా కాలేజీలను పూర్తి స్థాయిలో నిర్మించారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిశ్రమలు, ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని వివరించారు. దీంతో ప్రజలు వైసీపీని మరిచిపోతారనే భయంతో పార్టీ కార్యక్రమాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కోలాట వెంకటరమణ, శంకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



గిరిజనులతో సమావేశమైన టీడీపీ నేతలు, అధికారులు

వి.కోట నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని మండల టీడీపీ అధ్యక్షులు రాంబాబు అన్నారు. పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచన మేరకు గురువారం మండల పరిధిలోని గూబలబండ, కపట్లబండ, బాలింతరాళ్లబండ, నడమంత్రం గ్రామాల్లో తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, ఎంపీడీవో వెంకటేశ్వరావులు స్థానిక టీడీపీ నాయకులతో కలసి సమావేశాలు ఏర్పాటు చేశారు. అక్కడ స్థానికంగా వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షులు హరినాథరెడ్డి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, ఉపాధ్యక్షులు నాగరాజ్, నాయకులు శబరీష్, సుధాకర్‌రెడ్డి, సుబ్రమణ్యంశెట్టి, విశ్వ నాథ్, రాబాంబు, రఘు, ధర్మప్ప, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పుంగనూరు రూరల్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ హరిప్రసాద్ సూచించారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో మైనర్‌లు ద్విచక్రవాహనాలు నడిపి ప్రమాదాలకు గురైవుతున్నట్లు తెలిపారు. మైనర్‌లు వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగితే తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పాఠశాలకు పిల్లలు ద్విచక్రవాహనాలు తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైన ప్రమాదం జరిగితే 100, 112 ఫోన్‌నంబర్లకు ఫోన్ చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ డీఈ మహేష్

పుంగనూరు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో సేకరించిన చెత్త నుంచి సంపద సృష్టించడానికి సమన్వయంతో పని చేయాల్సివుందని మున్సిపల్ డీఈ మహేశ్ సూచించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ, వెల్ఫేర్, అమినిటీ కార్యదర్శల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో ఘన వ్యర్థాల నిర్వహణ ఎంతో కీలకమైందన్నారు. వీటి గురించి తెలుసుకుని సంపద సృష్టించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆల్ ఇండి యా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ రిసోర్స్‌పర్సన్ శ్రీనివాస్, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన పుంగనూరు నాయకులు

పుంగనూరు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్‌మాధవను పుంగనూరు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం తిరుపతిలో బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవను, రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు నిషిదరాజును కలిసి పార్టీ స్థితిగతులపై చర్చించినట్లు తెలిపారు. కలిసిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్‌రాజు, పెద్దమఠం బాబు, ప్రసాద్, వెంకటరెడ్డి, చంద్రరాజు, శంకర్, దిలీఫ్, రమేశ్ ఉన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

పుంగనూరు, నవంబరు13(ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఏఎంసీ చైర్మన్ శమీపతిని మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక మార్కెట్ యార్డులోని ఏఎంసీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంటు మైనార్టీ ఉపాధ్యక్షుడు సద్దాంహుసేన్‌తో పాటు పలువురు మైనార్టీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, ఫయాజ్, అన్సర్, రఫీక్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

దాదేపల్లెకు తీరనున్న తాగునీటి కష్టాలు



బోరు నుంచి వస్తున్న తాగు నీరు

చౌడేపల్లె, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): దాదేపల్లెకు తాగునీటి కష్టాలు తీరనున్నాయి. గురువారం మండలంలోని దాదేపల్లెలో పుంగ నూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, చౌడేపల్లె మండలాధ్యక్షులు గువ్వల రమేష్ రెడ్డి సహకారంతో నూతనంగా తాగునీటి కోసం టీడీపీ మైనార్టీ మండలాధ్యక్షులు మహ్మద్‌గని బోరు వేయించారు. రెండు ఇంచుల నీరు పడ్డాయి. గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమీద్‌ఖాన్ పాల్గొన్నారు.

రేపు ఉపాధ్యాయుల క్రీడలు

చౌడేపల్లె, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న ఉపాధ్యాయుల క్రీడలకు క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మలు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. క్రికెట్, త్రోబాల్ పోటీలు దాదేపల్లె సమీపంలోని కేపీఎల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు.

టీడీపీ రామకుప్పం మండల కార్యవర్గాల ఏర్పాటు











వెంకటరమణ - కామరాజనాయక్ - నరసింహులు - అలివేలుమంగమ్మ - అవినాశ్‌రెడ్డి

రామకుప్పం, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ రామకుప్పం మండల ప్రధానకమిటీ, అనుబంధ కమిటీలను గురువారం ఆ పార్టీ ప్రకటించింది. అదేవిధంగా నియోజకవర్గ అనుబంధ కార్యవర్గాల్లోనూ పలువురు మండల నేతలకు చోటు దక్కింది. పార్టీ మండల అధ్యక్షుడిగా వెంకటరమణ, ప్రధానకార్యదర్శిగా కామరాజనాయక్, ఉపాధ్యక్షురాలిగా ఉషారాణి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఎర్రప్ప, వెంకటరెడ్డి, శీనప్ప, కార్యదర్శులుగా సుధాకర్‌నాయక్, మురళీ, నియాజ్, కోశాధికారిగా సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా బాలకృష్ణ, వెంకటాచలం, తెలుగు మహిళ విభాగానికి గీత, సుగుణ, తెలుగురైతు విభాగానికి ఉమాపతి, కృష్ణారెడ్డి, మైనారిటీ సెల్‌కు ఆదిల్‌బాష, గౌస్‌ఖాన్, ఐటీడీపీకి భాస్కర్, గణేష్, బీసీసెల్‌కు వేలు, ఆనందశెట్టి, ఎస్సీసెల్‌కు హరికృష్ణ, మునిరత్నం, ఎస్టీసెల్‌కు సామూనాయక్, జయప్రకాష్‌నాయక్, సాంస్కృతిక విభాగానికి నారాయణ, మహదేవర్, వాణిజ్య విభాగానికి దయానంద, మంజునాథ్, వైద్య విభాగానికి సుహేల్‌పాషా, సాగర్‌రెడ్డి అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా నియమితులయ్యారు.











సలాంసాబ్ - బాలకృష్ణ- వెంకటాచలం- ఆదిల్ - భాస్కర్

ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నరసింహులు

టీడీపీ ఎస్టీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నరసింహులు నియమితులయ్యారు. రామకుప్పం మండలం రాజుపేటకు చెందిన నరసింహులు రెండు దఫాలుగా మండల ప్రధానకార్యదర్శిగా ఉన్నారు. అదేవిధంగా తెలుగుయువత, మైనారిటీ, తెలుగుమహిళ, వైద్య ఎస్సీ విభాగాల నియోజకవర్గ ప్రధానకార్యదర్శులుగా రామకుప్పానికి చెందిన అవినాశ్‌రెడ్డి, సలాంసాబ్, అలివేలుమంగమ్మ, సజ్జలసాగర్‌రెడ్డి, బల్లకు చెందిన హనుమంతు నియమితులయ్యారు. టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా పీఎంకేతండాకు చెందిన అనిల్‌కుమార్‌నాయక్, దివ్యాంగుల విభాగం ప్రధానకార్యదర్శిగా కొంగనపల్లెకు చెందిన నారాయణప్ప, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడిగా విజలాపురానికి చెందిన నారాయణస్వామి నియమితులయ్యారు. నియమితులైన వారంతా గురువారం కుప్పంలో జరిగిన కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేశారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు



చెక్కులు అందుకున్న బాధితులతో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరమని ఎంపీ దగ్గుగమళ్ల ప్రసాదరావు అన్నారు. గురువారం లక్ష్మీనగర్ కాలనీలోని ఎంపీ కార్యాలయంలో 18 మంది బాధితులకు రూ.10.89 లక్షల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పేదల పక్షపాతిగా చెరగని ముద్రవేసుకున్నారని చెప్పారు. పేదలకు వైద్య ఖర్చులు భారం కాకూడదనే ఉద్దేశంతోనే సీఎం రిలీఫ్ ఫండ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



కేవీపురంలో బాధితులను పరామర్శిస్తున్న భానుప్రకాష్

విజయపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేవీపురంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ నాయకుడు రంజిత్‌నాయుడు మృతదేహానికి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గురువారం పూలమాల వేసి నివాళి అర్పించారు. అలాగే పన్నూరు దళితవాడలో మృతి చెందిన వార్డు సభ్యుడు ఇన్బరసన్ మృతదేహానికి కూడా పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయా కుటుంబాలను పరామర్శించారు. ఆయనవెంట టీడీపీ నాయకులు బాబునాయుడు, వేణుగోపాల్‌నాయుడు, మధునాయుడు, బాబు, శరత్, దొరైరాజ్ తదితరులున్నారు.

సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ

వెదురుకుప్పం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం చిన్న హరిజనవాడలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు గురువారం కార్వేటినగరం మండల తెలుగు యువత అధ్యక్షుడు తోటి మురళీమోహన్ భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే థామస్ చొరవతో రోడ్డుకు నిధులు మంజూరు చేశారని ఆయన తెలిపారు.

చంద్రబాబుకు టీడీపీ నాయకుల కృతజ్ఞతలు



కృతజ్ఞతలు తెలుపుతున్న టీడీపీ ముస్లిం మైనారిటీ నాయకులు

వెదురుకుప్పం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇమామ్, మౌజన్‌ల గౌరవ వేతనాల కోసం రూ.90 కోట్లు విడుదల చేసిన నేపథ్యంలో సీఎం చంద్రబాబుకు కార్వేటినగరం మండల టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. ఇమామ్‌కి నెలకు రూ.10వేలు, మౌజన్‌కి రూ.5వేల గౌరవ వేతనం చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. సీఎంతోపాటు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎమ్మెల్యే థామస్‌కి కూడా ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. వీరిలో కార్వేటినగరం పట్టణం జామియా మస్జిద్ ఇమామ్, మౌజన్ అబ్దుల్ రెహ్మాన్, ఢంకా నియాజ్, యాకూబ్‌ఖాన్, సాజిద్‌బాషా, షేక్ సందాని, ఫయాజ్, ఖలందర్, ఇర్ఫాన్ బాషా, జమాల్ బాషా ఉన్నారు.

మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకుంటే ఎలా?: ఎంపీపీ



సమావేశంలో ప్రసంగిస్తున్న దుర్గాదేవి

నింద్ర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి మూడు నెలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకుంటే ఎలా అని ఎంపీపీ దుర్గాదేవి ప్రశ్నించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆమె అధ్యక్షతన నింద్ర మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ.. కింది స్థాయి సిబ్బందిని సమావేశానికి పంపడం వల్ల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. అత్తూరు సర్పంచ్ మలర్వేణి మాట్లాడుతూ.. విద్యార్థులను ఆర్టీసీ బస్సుల్లో అనుమతించడం లేదని చెప్పారు. కొప్పేడు ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. తిరుపతి-చెన్నై జాతీయ రహదారి పాలమంగళం నుంచి నింద్ర క్రాస్ వరకు అధ్వానంగా ఉందని ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీటీసీ విజేష్ మాట్లాడుతూ కావనూరు చెరువుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, పంచాయతీరాజ్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు వీరభద్రయ్య, శ్రీధర్‌రాజు, శర్మ, పశువైద్యాధికారి సాయిసౌందర్య ప్రసంగించారు. డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు, ఏవో తులసి, విద్యాశాఖ అధికారి శ్రీధర్‌రాజు, ఐసీడీఎస్ అధికారి ప్రియదర్శిని, ఉపాధి ఏపీవో చంద్రశేఖర్, ఇరిగేషన్ ఏఈ లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

● నగరి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి

నగరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా కట్టిన భవనాల యజమానులు బీపీఎస్‌ను సద్వినియోగం చేసుకుని, క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో సూచించారు. 1985 జనవరి ఒకటి నుంచి 2025 ఆగస్టు 31వ తేదీలోపు అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. ప్రభుత్వ, దేవదాయ శాఖ, నది, వాగు భూములు, ట్యాంకు బెడ్, రోడ్డు, పార్కు స్థలాలు, వివాదాస్పద భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు క్రమబద్ధీకరణ ఉండదన్నారు. పూర్తి వివరాలకు బీపీఎస్.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడొచ్చన్నారు.

సహకార సంఘాలు కీలకం

వెదురుకుప్పం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆత్మ నిర్భర్ భారత్‌ను సాధించడంలో సహకార సంఘాలు కీలకమని చవటగుంట పీఏసీఎస్ చైర్మన్ బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పచ్చికాపల్లం డీసీసీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజరు కె.సురేష్‌బాబు తెలిపారు. గురువారం వెదురుకుప్పంలో వారు మీడియాతో మాట్లాడారు. శుక్రవారం నుంచి సహకార వారోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చిత్తూరు డీసీసీబీ సరికొత్తగా సహకార రికరింగ్ డిపాజిట్ స్కీమ్ విడుదల చేసిందని చెప్పారు. సాధారణ ఆర్డీవలె ఒకే మొత్తంలో నెల నెలా పొదుపు చేయాల్సిన అవసరం లేకుండా.. వంద రూపాయలతో ప్రారంభించి ప్రతి నెలా ఎంతైనా ఇందులో పొదుపు చేయవచ్చన్నారు. ఈ స్కీమ్ ద్వారా సాధారణ ప్రజలకు 7.75 శాతం, సీనియర్ సిటిజన్‌లకు 8.25శాతం వడ్డీ లభిస్తుందని వివరించారు.

23 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నగరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరి 220 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో సామర్థ్యం పెంపు పనులు గురువారం నుంచి జరుగుతుండటంతో ఈనెల 23వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. ఈ మేరకు ట్రాన్స్‌కో కన్‌స్ట్రక్షన్ ఈఈ శ్రీనివాసన్ తెలిపారు. నగరి, నాగలాపురం, పుత్తూరు, కొత్తపల్లెమిట్ట, పచ్చికాల్వ, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విజయపురం మండల సమావేశం

విజయపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ మంజు బాలాజీ అధ్యక్షతన విజయపురం మండల సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు ఎంపీడీవో రాజేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే మురళీమోహన్ - పండుగ వాతావరణంలో పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం

తవణంపల్లె/ఐరాల/పూతలపట్టు నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. తవణంపల్లె మండలం ఐరాల క్రాస్ రోడ్డులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో గురువారం పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అప్పుల ఊబిలో కూరుకున్న రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ల కృషిని కొనియాడారు. త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో కూటమి పార్టీల జెండాలు రెపరెపలాడాలన్నారు. టీడీపీ అభివృద్ధికి కార్యకర్తలే పునాది అన్నారు. ఏ సమస్యనైనా తన దృష్టికితెస్తే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పూతలపట్టు, ఐరాల, తవణంపల్లె, బంగారుపాళ్యం, యాదమరి మండలాల అధ్యక్షులుగా ఎన్నుకున్న దొరబాబుచౌదరి, గంగారపు హరిబాబు నాయుడు, ధరణీప్రసాద్, మురార్జి, వెంకటేష్‌చౌదరితోపాటు పలు కమిటీల సభ్యుల ప్రమాణ స్వీకారం చేశారు. నాయకులు యువరాజు నాయుడు, ఎన్పీ జయప్రకాష్‌నాయుడు, గంగారపు గోపి, బాబురావు, కె.చలపతినాయుడు, నాగేశ్వరరావు, మణినాయుడు, మధుసూదనరావు, చంద్రబాబు, ప్రతాపనేని చంద్రమౌళి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, టీడీపీ తోరణాలు, జెండాలు, ఫ్లెక్సీలతో కాణిపాకం క్రాస్ రోడ్డు పసుపుమయంగా మారింది.



ప్రమాణ స్వీకారం చేస్తున్న టీడీపీ నాయకులు

స్పర్శలేని మచ్చలతో ప్రమాదం

● ఎల్సీడీసీపై శిక్షణ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శరీరంపై స్పర్శలేని మచ్చలు ప్రమాదమని డీఎంహెచ్‌వో సుధారాణి అన్నారు. గురువారంలోని తన కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్యాధికారులకు ఎల్సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్)పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా ఈ నెల 17వ తేదీ నుంచి ఇంటింటా కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. ఈ సర్వేలో మచ్చలు ఉన్నవారిని వైద్యాధికారికి వద్దకు తీసుకెళ్లి పరీక్షలు చేయించాలని ఆశా కార్యకర్తలకు సూచించారు. ఈనెల 30వ తేదీవరకు ఈ సర్వే జరుగుతుందని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా టీబీ, కుష్టు నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, డీఐవో హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



వైద్యాధికారులకు సూచనలిస్తున్న సుధారాణి

'బృందావన్' విద్యార్థుల ర్యాలీ



చిత్తూరు సెంట్రల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బృందావన్ స్కూల్ విద్యార్థులు కరస్పాండెంట్ శైలజా కుమారి ఆధ్వర్యంలో నగరంలో గో గ్రీన్ ర్యాలీ నిర్వహించారు. నెహ్రూ జయంతిలో భాగంగా గురువారం పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాల నుంచి హైరోడ్డు మీదుగా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. టీచర్లు పాల్గొన్నారు.

వేగంగా రోడ్డు విస్తరణ పనులు



చిత్తూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలో రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గాంధీ రోడ్డు (కోర్టు డౌన్)లో ప్రైవేటు స్థలాల యజమానులను ఒప్పించి.. వారి అంగీకారంతో రోడ్డుకు అవసరమైన 60 అడుగుల స్థలాన్ని ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాలతో ఈ పనులను వేగంగా చేపడుతున్నట్లు ఏసీపీ నాగేంద్ర తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పాల్గొన్నారు.

అనధికారికంగా నిర్మించే భవనాలు కూల్చేస్తాం

● నగరపాలక సంస్థ ఏసీపీ హెచ్చరిక



మురకంబట్టులో అనధికార భవనాన్ని కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

చిత్తూరు అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అనధికారికంగా నిర్మించే భవనాలను కూల్చివేస్తామని నగరపాలక సంస్థ ఏసీపీ నాగేంద్ర హెచ్చరించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాలతో నిబంధనలకు విరుద్ధంగా, అనధికారికంగా నిర్మించే భవనాలు, షెడ్లు, ఇతర నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టం చేశారు. గురువారం మురకంబట్టు, సంతపేట, ఇందిరానగర్ ప్రాంతాల్లో గుర్తించిన అనధికార భవనాలను, షెడ్లను తొలగించారు. నిబంధనలను అనుసరించి నిర్మాణాలు చేసుకోవాలని ప్రజలకు ఏసీపీ సూచించారు.

చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి



ఎస్ఎల్‌సీని ప్రారంభిస్తున్న పాఠశాల సిబ్బంది

చిత్తూరు సెంట్రల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని నారాయణ డీజీఎం కొండలరావు అన్నారు. గురువారం కొంగారెడ్డిపల్లెలోని నారాయణ పాఠశాలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ఎల్‌సీ) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ చిన్నారులకు సృజనాత్మకతమైన బోధనే చేయడమే ఎస్ఎల్‌సీ లక్ష్యమన్నారు. ఏజీఎం రవీంద్ర, అరబి, తహసీన్, జుల్ఫీ, ప్రిన్సిపాల్ ఏకాంబరం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆవలకొండలో వైద్యశిబిరం



గంగాధరనెల్లూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆవలకొండలో చాలా మంది జ్వరాలు, దగ్గు, జలుబు వంటి సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని పీహెచ్‌సీ డాక్టర్ మౌనికకు పెనుమూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ నియాజ్‌అలీ తెలిపారు. ఈ క్రమంలో గ్రామంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. 123 మందికి పరీక్షలు చేసి మాత్రలు, మందులు పంపిణీచేశారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, సిబ్బంది, టీడీపీ నాయకులు సంపత్, మెహిది అలీ, అతేహార్ అలీ, వహీద్‌అలీ, జక్కి అబ్బాస్ పాల్గొన్నారు.

నేడు మండలాధ్యక్షుడి ప్రమాణ స్వీకారం



ఎన్పీ ధరణీప్రసాద్

బంగారుపాళ్యం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం మండల టీడీపీ అధ్యక్షుడిగా ఎన్పీ ధరణీప్రసాద్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. మండల కేంద్రంలోని రాగిమానుపెంటకు వెళ్లే రహదారిలోని భాగ్యలక్ష్మి కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ అనుబంధ కమిటీల నేతలు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని మండల టీడీపీ గౌరవాధ్యక్షుడు ఎన్పీ జయప్రకాష్ కోరారు.

సంక్షిప్తంగా..

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

బంగారుపాళ్యం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని క్లస్టర్ హెచ్ఎం లక్ష్మీకాంతమ్మ అన్నారు. గురువారం తుంబకుప్పం క్లస్టర్ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులతో ఆమె సమావేశం నిర్వహించారు. టీచర్లు పాల్గొన్నారు.

పెనుమూరు సంతలో దొంగలు!

పెనుమూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెనుమూరులో ప్రతి బుధవారం నిర్వహించే వారపు సంతలో దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. సెల్‌ఫోన్లు, పర్సులు, నగలను కొట్టేస్తున్నారు. ఈనెల 12వ తేదీన జరిగిన సంతలోనూ ముగ్గురి సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయి. ఈ దొంగలపై పోలీసులు ఓ కన్నేయాలని జనం కోరుతున్నారు.

వైసీపీ గ్రామ కమిటీల ఎన్నిక

విజయపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కోసలనగరం, జంబాడ వైసీపీ గ్రామ కమిటీలను గురువారం కోసలనగరంలో ఎన్నుకున్నారు. కోసలనగరం అధ్యక్షుడిగా హరిబాబు యాదవ్‌ను, జంబాడ సుబ్బుయాదవ్‌ను నియమించారు. వివిధ అనుబంధ కమిటీలనూ కూడా ఎంపిక చేసినట్టు వైసీపీ మండల అధ్యక్షుడు శివరాజు, ఉపాధ్యక్షుడు సతీష్‌యాదవ్ తెలిపారు.

బీజేపీలో చేరిన వైసీపీ నేత

శ్రీరంగరాజపురం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, ఉడమలకుడి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సురేష్ వర్మ.. బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. తిరుపతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మహిళ మోర్చా అధ్యక్షురాలు నిషిద రాజు సమక్షంలో బుధవారం బీజేపీ కండువా వేసుకున్నారు.

విద్యాసామగ్రి వితరణ



విజయపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మంగళం దళితవాడ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు విద్యాసామగ్రిని గురువారం విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రయ్య వితరణ చేశారు. హెచ్ఎం లత, టీచర్లు పాల్గొన్నారు.